నిర్వహణ భారం తగ్గించేందుకు ఫోర్ఇన్వన్ డిసి యూనిట్

ప్రజాశక్తి-నెల్లూరు: నిర్వహణ భారం తగ్గించేందుకు విద్యుత్ ఉపకేంద్రాల్లో ఫోర్ ఇన్ వన్ డిసి యూనిట్లను అమర్చుతున్నామని టౌన్ డివిజన్ ఎ.ఇ ఎం శ్రీదర్ పేర్కొన్నారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఈ యూనిట్ దోహదపడుతుందన్నారు. బ్యాటరీల నిర్వహణ భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా సబ్ స్టేషన్లలో ఈ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రయోగాత్మకంగా కొండయపాలెం, బి.వి. నగర్, రేబాల వీధి సబ్ స్టేషన్లలో మూడు ఫోర్ ఇన్ వన్ డిసి యంత్రాలను ఏర్పాటు చేసేందుకు ఏపీఎస్పీడీసీఎల్ అందజేసిందన్నారు. ఈ విధానం వల్ల బ్రేకర్లకు నేరుగా విద్యుత్ ఛార్జింగ్ అయ్యే అవకాశం ఉంటుందని, దీని వల్ల జిల్లాలో వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ యంత్రాల పనితీరును పరిశీలించామని, త్వరలో అన్ని సబ్ స్టేషన్లలో అమర్చాలని నిర్ణయించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ ఏ. అశోక్, వి. సుప్రియ, అసిస్టెంట్ ఇంజనీర్స్ దామోదర్ రెడ్డి, లక్ష్మీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారులు

కరేడు ఇంటా..బయటా..నిరసనల హోరు..!

- రైతు, ప్రజా సంఘాల నేతలు అరెస్ట్
- గ్రామంలో హోరెత్తిన ప్రజా గళం
- పోలీసుల ఆంక్షలు చేదించి ముందుకు
- జిల్లా వ్యాపితంగా ఆందోళనలు

కరేడు భూసేకరణ వ్యతిరేక ఉద్యమంలో సోమవారం ఉత్కంఠ, ఉద్రిక్తత నెలకొంది....పోలీసుల హెచ్చరికలకు బెదరలేదు...జిల్లా వ్యాపితంగా హౌస్ అరెస్ట్ చేసినా బెదరక కరేడు వైపు రైతులు, ప్రజలు అడుగులేశారు... కరేడు గ్రామంలో " హర హర మహాదేవ. శంభోశంకరా... మా ఊరును కాపాడు.... మా పొలాలు కాపాడు " అంటూ గ్రామస్తులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు....కరేడు ప్రజలకు సంఘీభావం చెప్పడానికి "చలో కరేడు"కు పిలుపునిచ్చిన రైతు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు ..." కరేడు భూములను ఇండోసోల్కు తీసుకోవద్దు....పచ్చని కరేడును బతకనివ్వండి" అంటూ గ్రామంలోకి రావడానికి ప్రయత్నం చేసిన నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు. లాక్కెళ్లి వ్యానుల్లో పడేశారు. మహిళలు పోలీసులతో వీరోచితంగా పోరాటాలు...ఎట్ట కేలకు అరెస్ట్ చేసి కందుకూరు నియోజకవర్గంలోని పలు పోలీసు స్టేషన్లో నాయకులను ఉంచారు..సాయంత్రం 5.30 గంటలకు సొంత పూచికత్తుపై విడుదల చేశారు...శ్రావణ సోమవారం కరేడులో ఖాళీల రాజ్యం కనిపించింది. ప్రజలు నిర్వహించిన చలో కరేడు విజయవంతమైంది..


సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వివిఎస్ఆర్, మూలం రమేష్లను అరెస్టు చేసిన దృశ్యం

ప్రజాశక్తి–ఉలవపాడు

జిల్లాలోని కందుకూరు నియోజకవర్గం, ఉలవపాడు మండలం, కరేడులో బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా 50 రోజులుగా పోరాడుతోన్న ప్రజలకు సంఘీభావం చెప్పడానికి రైతు సంఘాలు, ప్రజా సంఘాలు సోమవారం 'చలో కరేడు'కు పిలుపు నిచ్చాయి...ఆదివారం సాయంత్రానికే పోలీసులు కరేడు ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎవరూ కరేడు రావద్దంటూ నోటీసులు జారీ చేశారు. సోమవారం ఉదయం జిల్లా వ్యాపితం నాయకులు, కార్యకర్తలను హౌస్ అరెస్ట్ చేశారు..కరేడు గ్రామ పరిధిలో సుమారు 150 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిం చారు..సోమవారం ఉదయం 10.30 గంటల వరకు ఎవరూ కరేడు గ్రామం వైపు రాకపోవడంతో పోలీసులు హమ్మయ్యా.. ఆంటూ ఊపిరిపీల్చుకున్నారు.. 10.30 గంటలకు కలకత్తా – చెన్నయ్ 16వ జాతీయ రహదారి వెంకటేశ్వస్వామి దేవాలయం ప్రాంగణానికి ఒక్కొక్కరు రాసాగారు. కేవలం పది నిమిషాల వ్యవధిలోని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి, కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు దడాల సుబ్బారావులు రావడంతోపాటు జిల్లా నలుమూలల నుంచి రైతులు, ప్రజా సంఘాల నాయకులు అక్కడకు చేరుకున్నారు..అక్కడ నుంచి కరేడు వైపు వెళ్లడానికి ముందుకు సాగారు. ఒక్కసారిగా పోలీసులు భారీగా చేరుకొని అనుమతులు లేవంటూ అడ్డపడడంతో తాము ప్రజలను కలవడానికి వెళుతున్నామంటూ ముందుకు సాగారు. నాయకులను అరెస్ట్ చేసి, వ్యాను ఎక్కించారు. కరేడుకు సంఘీభావంగా పెద్ద ఎత్తున నినదించారు. ఉద్యమకారులు జాతీయ రహదారిపై కరేడు వైపు పరుగులు తీశారు. మహిళలు పెద్ద ఎత్తున ఆందోళనలో పాల్గొన్నారు. పోలీసులకు, ఉద్యమకారులకు వాగ్వాదం జరిగింది. రోప్స్తోపాటు, ఎక్కడికక్కడ నివారించారు. బలవంతంగా రైతు సంఘాల నాయకులు మూలం రమేష్, ఎం. మోహన్రావు, గోగుల శ్రీనివాసులు, డివైఎఫ్ఐ నాయకులను వ్యాన్లో పడేశారు. మహిళలను పోలీసు ఆంక్షలు లెక్కచేయకుండా ముందుకు సాగారు. తాము ప్రజలకు మద్దతు తెలపడానికి వెళుతున్నామని, తమను వదలాలని కోరారు. పోలీసులు అనుమతించకపోవడంతో కరేడు గ్రామం వైపు పరుగులు తీశారు. అతి కష్టమీద మహిళలను అరెస్ట్ చేశారు. వి. శ్రీనివాసరావుతోపాటు ముఖ్యనా యకు లను వలేటిపారిపాళెం పోలీసు స్టేషన్కు తరలించారు. కందుకూరు, సింగరాయకొండ, తదితర పోలీసు స్టేషన్లకు తరలించారు. సాయంత్రం 5.30 గంటలకు సొంత పూచికత్తుపై విడుదల చేశారు..కరేడు భూపోరాటానికి మద్దతుగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతు, ప్రజా సంఘాల నాయకులను అక్రమ అరెస్టను నిరసనగా జిల్లా వ్యాపితంగా ఆందోళనలు నిర్వహించారు. నెల్లూరునగరంలో బాలాజీ నగర్లోని సిపిఎం కార్యాలయం నుంచి బాబుజగ్జీవన్రామ్ విగ్రహం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అక్రమ అరెస్టలను ఖండించారు. వలేటివారిపాళెం స్టేషన్ నుంచి విడుదలైన నాయకులు అక్కడ నుంచి ర్యాలీ నిర్వహించారు. టిపి గూడూరు, అనంతరసాగరం, నెల్లూరు నగరంలోని పలు చోట్ల, పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి.

వినూత్న నిరసన కార్యక్రమం

కరేడు రెవెన్యూ పంచాయతీ పరిధిలో ఎన్డీఏ ప్రభుత్వం భూసేకరణ పేరుతో తలపెట్టిన కార్యక్రమానికి వ్యతిరేకంగా "చలో కరేడు" కార్యక్రమం సోమవారం కరేడులో గ్రామస్తులు రైతులు భారీ ఎత్తున పాల్గొని జయప్రదం చేశారు. ఈ సందర్భంగా స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి. ఎన్ని కష్టాలు వచ్చినా ఎన్ని అవరోధాలు వచ్చినా మా భూములు సెంటు కూడా ఇవ్వమంటూ కరేడు గ్రామస్తులు రైతులు శివాలయంలో ప్రతిజ్ఞ పూనారు. గ్రామస్తులందరూ మూకుమ్మడిగా విండో సోలార్ కంపెనీకి తమ భూములను ఇచ్చేది లేదంటూ భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహిస్తూ పోలేరమ్మ గుడి వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభ సిఐటియు జిల్లా కార్యదర్శి కె.అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. కరేడు గ్రామంలో ప్రభుత్వం పెట్టిన 30సెక్షన్ తక్షణం ఎత్తి వేయాలి. కరేడు గ్రామ ప్రజలు తమ భూములను రక్షించుకునేందుకు శాంతియుతంగా ఆందోళన చేస్తూ ఉంటే ప్రభుత్వం బలవంతంగా రైతులను భయభ్రాంతులకు గురిచేసి పంట పొలాలను లాక్కునే ప్రయత్నం చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం 16,000 మంది రైతుల పక్షాన ఉంటుందా? ఒక సోలార్ కంపెనీ యజమాని పక్షాన ఉంటుందా ? తెలుసుకోవాలని డిమాండ్ చేశారు.

శ్రావణ సోమవారం రోజున గ్రామ ప్రజలు శివాలయంలో పూజలు చేసి తమ భూములను కాపాడమని కోరారు. భూములు తీసుకోవడం పాపపు చర్య దేవుడు కూడా చంద్రబాబు ప్రభుత్వాన్ని క్షమించరన్నారు. కరేడు గ్రామం లాంటి పచ్చని పంట పొలాల్లో కాకుండా వినుకొండ, దొనకొండ ప్రాంతంలో ఉన్న ఎందుకు వ్యవసాయానికి పనికిరాని భూములలో పరిశ్రమ పెట్టమని దానికి ఎవకి ఎలాంటి అభ్యంతరం ఉండదని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. పోలీసు నిర్బంధం , తప్పుడు కేసులు ద్వారా రైతులను భయభ్రాంతులకు గురి చేయాలనే ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించు కోవాలన్నారు. రెవెన్యూ యంత్రాంగం రాజకీయ నాయకులకు కంపెనీ ప్రతినిధులను ఉపయోగించి ప్రజల్లో చీలిక తీసుకువచ్చే ప్రయత్నం చురుకైన వారిపై తప్పుడు కేసులు బనాయించడం గ్రామంలో30 సెక్షన్ అమలు చేయడం ద్వారా భయపెట్టాలని చూస్తున్నారని, "చలో కరేడు" కార్యక్రమంతో రాష్ట్ర వ్యాప్తంగా రైతు సంఘాలు కరేడు ప్రజల పోరాటానికి అండగా ఉన్నారన్నారు. . కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు చిట్టి పాటి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు శివ నాగరాణి, సామాజిక కార్యకర్త వసుంధర, హైకోర్టు న్యాయవాది శ్రీదేవి,సిఐటియు నెల్లూరు జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నెల్లూరు జిల్లా కార్యదర్శి పుల్లయ్య, సిపిఎం కందుకూరు డివిజన్ కార్యదర్శి షేక్ గౌస్, రైతు కూలీ సంఘం నెల్లూరు జిల్లా నాయకులు సాగర్, మోహన్ కరేడు భూపోరాట సమితి జేఏసీ నాయకులు మిరియం శ్రీనివాసులు, రమణారెడ్డి, గ్రామస్తులు ,రైతులు తదితరులు భారీగా పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న గ్రామస్తులు

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి


అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను జాప్యం లేకుండా త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్తో పాటు డిఆర్వో హుస్సేన్సాహెబ్, జడ్పీ సిఇవో మోహన్రావు, డ్వామా పీడీ గంగాభవాని, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్రెడ్డి అర్జీలను స్వీకరించారు. నగరంలోని ఉమేష్చంద్రా కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో బాధితుల నుంచి స్వీకరించిన వినతులను విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని ఎస్.పి జి. కృష్ణకాంత్ పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమంలో మొత్తం 78 ఫిర్యాదులను పోలీసు అధికారులు స్వీకరించారు.

ప్రజాశక్తి–నెల్లూరు కార్పొరేషన్

ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ నందన్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో పాటు విష జ్వరాలు ప్రభలే అవకాశం అధికంగా ఉంటుందన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్లను ఆక్రమిస్తూ వాహనాలకు అడ్డంకిగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలను, ఆక్రమణలను అన్ని డివిజన్లలో తప్పనిసరిగా తొలగించి ట్రాఫిక్ నిర్వహణకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నగరవ్యాప్తంగా చికెన్ షాపుల వద్ద లోడింగ్ అన్లోడింగ్ ప్రక్రియలో వ్యర్ధాలు రోడ్లపై పడకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించామని, ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్ మోహన్ రావు, ఈ.ఈ శేషగిరిరావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, మేనేజర్ రాజేశ్వరి, సూపరెంటెండెంట్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఎంఎల్ఏ ఆశీర్వాదం

ప్రజాశక్తి-కందుకూరు: వలేటివారిపాలెం మండలం, బడేవారిపాలెం గ్రామానికి చెందిన ఉన్నం కోటయ్య కుమారుడు వివాహ కార్యక్రమం సోమవారం కందుకూరు శ్రీ వెంగమాంబ కళ్యాణ మండపంలో జరగగా కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు దంపతులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు పార్టీ నాయకులు నార్నే రోశయ్య పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణలపై నిరంతర పర్యవేక్షణ

పజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లను ఆక్రమిస్తూ ఎలాంటి నిర్మాణాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించా లని, ఆక్రమిస్తూ నిర్మించిన కట్టడాలను అన్ని డివిజన్లలో గుర్తించి, సంబంధిత నోటీసులను జారీ చేసి వాటిని తొలగించాలని కమిషనర్ వై.ఓ నందన్ టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు.పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ స్థానిక జాఫర్ సాహెబ్ కాల్వకట్ట పరిసర ప్రాంతాలలో పర్యటించారు. కాలువ కట్ట ప్రాంతంలో రోడ్లను ఆక్రమిస్తూ ఇరుపక్కల ఉన్న ఆక్రమణలను, వ్యాపారాలను కమిషనర్ గమనించి, సంబంధిత వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నోటీసులు జారీ చేసి వెంటనే ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు..

సచివాలయంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

మండలంలోని కలవళ్ల గ్రామంలోని సచివాలయాన్ని సోమవారం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు గారు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆ సమయంలో సచివాలయంలో ఒక్కరు తప్ప, మిగిలిన సిబ్బంది ఎవరూ లేరు. దీంతో సిబ్బంది తీరుపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు..విధులలో సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని సచివాలయ ఉద్యోగులను హెచ్చరించారు...సచివాలయంలో హాజరు పట్టిని మూమెంట్ రిజిస్టర్ ను తనిఖీ చేశారు. ఎవరెవరు ఎక్కడికి వెళ్లారు అన్నదానిపై ఆరా తీశారు. కొంతమంది పై అధికారులకు సమాచారం ఇవ్వకుండానే, బయటకు వెళ్లినట్టు గుర్తిం చారు. అనంతరం కలెక్టర్ ఆనంద్కు ఫోన్ చేసి, సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదు చేశారు. ప్రజలకు అందుబాటులో లేకుండా, సమయపాలన పాటించకుండా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్రోన్ పై ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి-నెల్లూరు: దేశ సేవ నుంచి పల్లె సేవలో భాగంగా కేంద్రీయ సైనిక్ బోర్డు రాష్ట్ర సైనిక్ బోర్డు కలిసి జిల్లా సైనిక్ బోర్డు ద్వారా జిల్లా మాజీ సైనికులకు కోరమండల్ కంపెనీ ద్వారా డ్రోన్స్ పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన గోడపత్రికలను జిల్లా సైనిక్ బోర్డు చైర్మన్ కలెక్టర్ ఒ. ఆనంద్ ఆవిష్కరించారు. ఈ అవకాశాన్ని జిల్లా మాజీ సైనికులు వినియోగించుకుని, వ్యవసాయానికి సహకారం అందిస్తూ పల్లె సేవ చేస్తూ ఉపాధి పొందవచ్చని కలెక్టర్ తెలిపారు.

ఎంఎల్ఏను కలిసిన పిఏసిఎస్ చైర్మన్

ప్రజాశక్తి-లింగసముద్రం

చినపవని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గా ఎంపికైన ముల్లపాటి లక్ష్మీనరసింహం చౌదరి, సభ్యులు రావెళ్ల మాలకొండయ్య, కనపర్తి మాలకొండయ్య లు సోమవారం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుని మర్యాదపూర్వకంగా కలిసి కతజ్ఞతలు తెలిపారు.తమపై నమ్మకంతో తమను సొసైటీ చైర్మన్ నియమిం చేందుకు సహకరించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అడుగుజాడల్లో నడుస్తూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామని లక్ష్మీ నరసింహ చౌదరి పేర్కొన్నారు. కార్యక్రమంలో రాళ్లపాడు ఆయకట్టు చైర్మన్ ఏలూరు వెంకటేశ్వర్లు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మోతుకూరి పర్వతాలు, మేదరమిట్లపాలెం గ్రామ సర్పంచ్ కూరపాటి మాధవి, పార్టీ నాయకులు సోంపల్లి మనోహర్, బుచ్చయ్య చౌదరి, మాధవరపు బ్రహ్మయ్య, కంకణాల సుబ్బులు నాయుడు,గొర్రెపాటి శీను, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు..

వికలాంగులకు పెన్షన్లు తొలగించడం దారుణం

ప్రజాశక్తి-నెల్లూరు: అర్హత కలిగిన వికలాంగులకు కూటమి ప్రభుత్వం పెన్షన్లు తొలగించడం దారుణమని వికలాంగుల సంఘం రాష్ట్ర నాయకులు ఆవుల నాగేంద్ర అన్నారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అర్హత కలిగి తొలగించిన వికలాంగులకు సంబంధించిన సమాచారాన్ని కలెక్టర్కు అందజేసి సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

పాలక మండలి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలోని వరిగొండలో వెలసిన శ్రీ జ్వాలాముఖి అమ్మవారి ఆలయ పాలక మండలి సోమవారం ప్రమా ణ స్వీకారం చేసింది. చైర్ పర్సన్ గా కోడూరు రాజేశ్వరి ప్రమాణ స్వీకారం చేశారు. పాలకమండలి సభ్యులతో దేవాదాయ ధర్మదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తా తా శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. అ నంతరం అమ్మవారి సన్నిధిలో చైర్ పర్సన్ రాజేశ్వరి ,పాలక మండలి సభ్యులు కె. భాస్కర్ రెడ్డి, జానా జ్యో తి, ఎస్. కల్పన, పి. అమత, ఎం. తిరుపాలు, అన్నం శి వశంకర్, బూదూరు మురళి, బి. శ్రీనివాసన్, ఎస్. పిచ్చ మ్మలు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కే. జనార్దన్ రెడ్డి ఇన్స్పెక్టర్ శ్రీనివాస బాబు ఆధ్వర్యం లో బాధ్యతలు స్వీకరించారు.

సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలను కొనుగోలు చేయాలి


ప్రజాశక్తి-గుడ్లూరు

గుడ్లూరు లోని రెవెన్యూ కార్యాలయం ఆవరణలో వ్యవసాయ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో మార్కెట్ ఏర్పాటు చేసిన సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలు కొనుగోలు చేయాలని వ్యవసాయ సిబ్బంది తెలియజేశారు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చిన వినియోగదారులు ఆకుకూరలు, కూరగాయలు కొనుగోలు చేశారు. రసాయనక ఎరువులు వినియోగించకుండా సేంద్రియ ఎరువులతో కూరగాయలు పండించడం జరిగిందని వ్యవసాయ శాఖ ప్రతినిధి పి సుధారాణి తెలిపారు. దొండకాయలు, చిక్కుళ్లు, తదితర కూరగాయలు అమ్మకానికి పెట్టారు. కార్యక్రమంలో కె. రేవతి, టి.వంశీ, సిహెచ్ రాజా, లలిత, మౌనిక, వీరరాఘవయ్య పాల్గొన్నారు.

కందుకూరు పట్టణాభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు పట్టణ అభివృద్ధి నిరంతర యజ్ఞంలా సాగుతుందని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కీర్తిశేషులు ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పామూరు రోడ్డు జంక్షన్ వరకు రోడ్ల వెడల్పు, డివైడర్ ఏర్పాటు, సెంట్రల్ లైటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. అంబేద్కర్ విగ్రహం నుంచి వాసవి నగర్ వరకు డబుల్ రోడ్డు, డివైడర్ నిర్మాణం, సెంటర్ లైటింగ్ ఏర్పాటు కోసం మూడు రోజుల్లో భూమి పూజ చేయబోతున్నారు.. ఏళ్ల క్రితం ఎప్పుడో నిర్మించిన సైడ్ కాలువల స్థానంలో కాంక్రీట్ కాలువలు నిర్మించేందుకు 2 కోట్ల రూపాయల నుడా నిధులు ఖర్చు చేస్తామని తెలిపారు.కందుకూరు తెలుగుదేశం కార్యాలయంలో సోమవారం శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మీడియా సమావేశం నిర్వహించారు.కందుకూరు పట్టణాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలో పక్క ప్రణాళిక ద్వారా ముందుకు వెళుతూ, నిధుల సమీకరణకు ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రజలు మా మీద పెట్టుకున్న ఆశలన్నీ నెరవేర్చటానికి కృషి చేస్తున్నామన్నారు.. కందుకూరు పట్టణాన్ని మోడల్ మున్సిపాలిటీగా తయారు చేయడమే లక్ష్యమన్నారు.అధికార కూటమి ప్రభుత్వంపై సాక్షి మీడియా పిచ్చి రాతలు రాస్తోందన్నారు.పట్టణ అభివృద్ధి కోసం 20 కోట్లు ఇస్తామని, రామాయపట్నం పోర్టు శంకుస్థాపనకు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారన్నారు. తరువాత ఒక్క పైసా కూడా విడుదల కాలేదన్నారు. ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కందుకూరు వచ్చినప్పుడు, 50 కోట్లు కందుకూరు పట్టణ అభివృద్ధికి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 7 కోట్ల రూపాయలు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. సిఎం రిలీఫ్ ఫండ్ నిధులు ఇప్పటికే నియోజకవర్గంలో 500 మంది లబ్ధిదారులకు ఉదారంగా నిధులు విడుదల చేశారు.కార్యక్రమంలో కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుసారెడ్డి కృష్ణారెడ్డి, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు పాల్గొన్నారు..



వాటర్ క్యాన్స్ పంపిణీ

పజాశక్తి-కందుకూరు

శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి ఆధ్వర్యంలో గుర్రం అల్లూరయ్య కుమారుడు అశోక్ , సాయి కిరణ్మయి పెళ్లి రోజు సందర్భంగా వారి సహకారంతో ,కోట చిన్నయ్య కుమారుడు వెంకట సాయి చక్రవర్తిల సహకారంతో కందుకూరు పట్టణంలోని బలిజపాలెం ప్రభుత్వ పాఠశాలలకు 2 కూలింగ్ వాటర్ క్యాన్ లను అందజేశారు. కార్యక్రమంలో రవ్వా శ్రీనివాసులు, సభ్యులు కోట వెంకటేశ్వర్లు, గుర్రం అల్లూరయ్య, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వాటర్ క్యాన్స్ అందజేస్తున్న దృశ్యం

నాయకుల నిరసన ర్యాలీ ..పోలీసుల తీరుకు ఖండన


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, గ్రామస్తులు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

కరేడులో బలవంతపు భూసేకరణను నిలిపివేయాలని కోరుతూ ఆందోళన నిర్వహిస్తున్న రైతు, ప్రజా సంఘాల నాయకులను అరెస్ట్ చేయడాన్ని నాయకులు తీవ్రంగా ఖండించారు సోమవారం కరేడు ప్రాంతంలో అరెస్ట్ చేసిన నాయకులను పోలీసులు వ్యానుల్లో వలేటివారిపాళెం పోలీసు స్టేషన్కు తరలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే కూర్చోపెట్టారు. సాయంత్రం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. పోలీసుల అక్రమ అరెస్టలకు నిరసనగా స్టేషన్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పోలీసు తీరు తప్పుబట్టారు. అంతకు ముందు పోలీసే స్టేషన్ వద్ద సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ. రైతుల నుంచి సెంటు భూమి కూడా బలవతంతగా తీసుకునేందుకు తాము ఒప్పుకోమని తెలిపారు. భూసేకరణను వెంటనే రద్దు చేయాలని,. కార్పొరేటీకరణను రద్దు చేయాలన్నారు. కరేడులో 17 వేలు జనాభా కలిగి 12 వేల ఎకరాలు కలిగిన పచ్చటి పొలాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పడానికి కూటమి ప్రభుత్వం ప్రజలను ప్రలోబాలతో మోసం చేసేందుకు ప్రయత్నిస్తుందని తెలిపారు. భూములను ఇవ్వడానికి ఇష్టం లేని ప్రజలు పోరాటం చేస్తుంటే వారిని అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గమని తెలిపారు. రైతుల పోరాటానికి మద్దతిస్తున్న వామపక్షాల నాయకులను అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎనిమిది వేల ఎకరాలను కార్పొరేట్ సంస్థల్లో అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తుందని చెప్పారు. పోలీసులు దిగ్బంధనం చేస్తే వెనకడుగు వేసేది లేదని, పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు కె. కేశవరావు, సిపిఎం రాష్ట్ర నాయకులు, డి.సుబ్బారావు, వి. వెంకటేశ్వర్లు, మాగంటి హరినాథ్, గణేష్ బాబు, నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్రావు, గోగుల శ్రీనివాసులు, నాయకులు షేక్ బాబు, కాలం సుబ్బారావు, తంబి శ్రీనివాసరావు, ఎన్. వీరాస్వామి.. సమిడి వెంకట్రావు. జయంతిబాబు: శ్రీకాంత్, బాలకోటయ్య, తిరుపతిరావు. పూస పాటి సుబ్బారావు, మాదాల రమణయ్య, మునవర సుల్తానా, వి మోజెస్, టి రాము, రమణారెడ్డి, ఎస్కె మస్తాన్బీ, ఎంవి. రమణ, ఎస్కె రషీద్, ఎస్.కె అన్వర్బాషా, పసుపులేటి పెంచలయ్య, ఆలూరు తిరుపాలు, అలాడి గోపాల్, ఎస్కెమస్తాన్ పేరమ్మ, ప్రమీల, సుబ్బమ్మ రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి–కందుకూరు

కరేడులో భూసేకరణ వ్యతిరేకంగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ప్రజలను, ప్రజా సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేసి వలేటివారిపాలెం, ఉలవపాడు, కందుకూరు తదితర పోలీస్ స్టేషన్లకు తరలించడాన్ని సిపిఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, అఖిల భారత రైతు –కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు తీవ్రంగా ఖండించారు. ఈ సభలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సి.ఎస్.సాగర్, పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ మోహన్, అఖిల భారత రైతు–కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు కే.నాంచార్లు, అజయ్, మోహన్,సిపిఐ, సిపిఎం రైతు సంఘాలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి–తోటపల్లిగూడూరు

కరేడు లో సిపిఎం,రైతు సంఘం ,ప్రజా సంఘాల నాయకుల అక్రమ అరెస్టు లను ఖండించండని సిపిఎం మండల కమిటీ పిలుపునిచ్చింది. సోమవారం నరుకూరు సెంటర్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి మారుబోయిన రాజా మాట్లాడారు.కార్యక్రమంలో సిపిఎం నాయకులు మోచర్ల రాధయ్య, ప్రభావతమ్మ, బొచ్చు వెంకటసుబ్బయ్య, ఆరణి గోపి, ఆకుల రఘు, శీను, యాసీన్, వేగురు శంకరయ్య, హరిబాబు, ఆకుల సునీల్, కుడుమల నారాయణ, అన్నం పుట్టయ్య బాబు, రఫీ, తులసమ్మ పాల్గొన్నారు.

జిల్లాలోని ఉలవపాడు మండలంలో కరేడు గ్రామంలో జరుగుతోన్న బలవంతపు సేకరణను వ్యతిరేకిస్తూ చలో కరేడు కార్యక్రమానికి వెళ్తున్న సిపిఎం నాయ కులను పోలీసులు అరెస్ట్ చేయడం దుర్మార్గమని సిపిఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య, సిఐటియు కార్యదర్శి మారుబోయిన రాజాలు విమర్శించారు.


గుడ్లూరు పోలీసు స్టేషన్లో అరెస్టు చేసిన దృశ్యం

ప్రజాశక్తి-గుడ్లూరు

గుడ్లూరులో సిపిఎం నాయకులు నివాస గృహాల దగ్గరికి చేరుకున్న గుడ్లూరు పోలీసులు కరేడు ఉద్యమానికి బయలుదేరిన సిపిఎం నాయకులు కొట్టే వెంకయ్యను ఇంటి దగ్గరే అదుపులోకి తీసుకొని హౌస్ అరెస్టు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'కాకాణి'కి హైకోర్టు బెయిల్ మంజూరు

నేడు విడుదల

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

మాజీ మంత్రి , వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్దన్రెడ్డికి సోమవారం రాష్ట్ర హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఎనిమిది కేసుల్లో ఆయన 70 రోజులుగా నెల్లూరు సెంటర్ జైల్లో రిమాండ్లో ఉన్నారు. బెయిల్కోసం అనేక ప్రయత్నాలు చేసిన తర్వాత సోమవారం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఎపి, తెలంగాణ దాటి వెళ్లకూడదని, నెల్లూరు జిల్లాలో ఉండకూడదని ఆదేశాలిచ్చింది. నేడు ఉదయం 10 గంటలకు ఆయన జైలు నుంచి విడుదల కానున్నారు. ఆయన రాక సందర్భంగా వైసిపి నాయకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. జైలు వద్ద స్వాగతం పలకడానికి జిల్లా నలుమూలల నుంచి తరలిరానున్నారు. జైలు నుంచి విడుదలైన తరువాత ఆయన గూడూరు, లేదా తిరుపతి ఎక్కడో ఒక చోట ఉండనున్నట్లు తెలిసింది..

రైతు, ప్రజాసంఘాల నేతల అరెస్టు దుర్మార్గం







- నగరంలో నిరసన ర్యాలీలు, రాస్తారోకోలు

ప్రజాశక్తి-నెల్లూరు

రైతు సంఘాల పిలుపు మేరకు చలో కరేడు కార్యక్రమంలో పాల్గొన్న రైతు, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అక్రమ అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ, సిపిఎం నగర, రూరల్ కమిటీ ఆధ్వర్యంలో పలుచోట్ల ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. కందుకూరు నియోజకవర్గం ఉలవపాడు మండల పరిధిలోని కరేడు గ్రామ భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు రైతాంగం నుంచి బలవంతంగా భూములను లాక్కునేందుకు రాష్ట్ర ప్రభుత్వ చేస్తున్న ప్రయత్నానికి వ్యతిరేకంగా ఏపి రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో చలో కరేడు కార్యక్రమం నిర్వహించాలని పిలుపునిచ్చాయి. ఈ పిలుపులో భాగంగా సోమవారం కరేడు ప్రాంతానికి వెళ్లేందుకు బయల్దేరిన ఏపి రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులను పోలీసులు ఎక్కడికక్కడే అడ్డుకొనే ప్రయత్నం చేశారు. నగరం, రూరల్ నియోజకవర్గ పరిధిలోని కొందరు నాయకులను పోలీసులు హౌస్ అరెస్టులు చేశారు. ముందుగానే కరేడు ప్రాంతానికి చేరుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తదితర ప్రజా సంఘాల నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి సమీప పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సమాచారం తెలుసుకున్న సిపిఎం శ్రేణులు నగర, రూరల్ ప్రాంతాల్లో పోలీసు చర్యలను ఖండిస్తూ నిరసన ప్రదర్శనలు, రాస్తారోకోలు నిర్వహించారు. సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో బాలాజీ నగర్ ప్రాంతంలోని సిపిఎం జిల్లా కార్యాలయం నుండి జ్యోతిరావుపూలే విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పూలే విగ్రహం వద్ద రాస్తారోకో చేపట్టారు. కరేడులో భూ సేకరణ తక్షణమే నిలిపివేయాలని, అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు కత్తి శ్రీనివాసులు, జి.నాగేశ్వరరావు, కాయంబు శ్రీనివాసులు మాట్లాడుతూ సారవంతమైన భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం సరైంది కాదని, భూములు లాక్కునే చర్యలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో వేలాది మంది ఉపాధి పొందుతున్నారని, కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం రైతుల జీవనాధారాన్ని కదిలించడం తగదని తెలిపారు. కరేడు భూ సేకరణ నోటిఫికేషన్ రద్దు చేయాలని, అక్రమ అరెస్టులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

రైతు సంఘాల నాయకులు అరెస్టు అమానుషం

ప్రజాస్వామ్యబద్ధంగా తమ భూమి కోసం పోరాడుతున్న కరేడు రైతులకు మద్దతుగా రైతు సంఘాల పిలుపు మేరకు "చలో కరేడు" కార్యక్రమానికి వెళ్తున్న మహిళ సంఘం రూరల్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు షంషాదు, షాహినా బేగం,రూరల్ మహిళా సంఘం నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం అమానుషమని రూరల్ ఐద్వా కమిటీ గౌరవాధ్యక్షురాలు అరిగెల రమమ్మ, కోశాధికారి ఎస్.వరలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు ఐద్వా రూరల్ కమిటీ ఆధ్వర్యంలో పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. అంతేకాకుండా కరేడు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ఐద్వా రూరల్ నాయకులు మహాలక్ష్మమ్మ, హైమవతమ్మ, భవానిలను గృహ అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఐద్వా నాయకత్వాన్ని వెంటనే విడుదల చేయాలని, కరేడు రైతుల న్యాయమైన కోర్కెలను నిర్బంధం లేకుండా అంగీకరించాలని ఐద్వా రూరల్ కమిటీ డిమాండ్ చేస్తోందన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు..

కరేడు గ్రామంలో బలవంతపు భూసేకరణను ఆపాలని కోరుతూ చలో కరేడు కార్యక్రమానికి సిపిఎం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో పాల్గొనే రైతులు, సిపిఎం నాయకులు, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు నిర్బంధించి, అక్రమంగా అరెస్టు చేశారు. పోలీసుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ నగర, రూరల్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్ల శాఖల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ప్రజాస్వామ్యబద్ధంగా తమ భూమి కోసం పోరాడుతున్న కరేడు రైతులకు మద్దతుగా రైతు సంఘాల పిలుపు మేరకు "ఛలో కరేడు" కి వెళ్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాస రావు, జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీపీఎం రూరల్ కమిటీ కార్యదర్శి కొండా ప్రసాద్, రూరల్ కార్యదర్శి వర్గ సభ్యులు కె.పెంచల నరసయ్య, కమిటీ సభ్యులు ఎన్. మాలకొండయ్య, బి. నాగేశ్వర రెడ్డి, ఇతర పార్టీ నాయకులు, అలాగే రూరల్ మహిళ సంఘ నాయకులను అరెస్టు చేసి కందుకూరు తరలించడాన్ని సీపీఎం రూరల్ కమిటీ తీవ్రంగా ఖండించింది. కరేడుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న రూరల్ కార్యదర్శి వర్గ సభ్యులు కట్ట సతీష్‌ను గృహ నిర్బంధం చేయడం హేయమన్నారు. పోలీసులు అక్రమంగా అరెస్టు చేసిన నాయకత్వాన్ని వెంటనే విడుదల చేయాలని, కరేడు రైతుల న్యాయమైన కోర్కెలను బేషరతుగా అంగీకరించాలని డిమాండ్ చేస్తూ నవలాకులతోట 1, 2వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో 3వ మైలు సెంటర్‌లో నిరసన, అలాగే సుభాన్ నగర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ అజీజ్, సీపీఎం రూరల్ కమిటీ సభ్యులు కామ్రేడ్ రూబియా, పార్టీ సభ్యులు తిరుపతమ్మ, రియాజ్, సుబ్బారెడ్డి, నిలకంఠం, శివకుమార్, రామారావు, జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు. 17వ డివిజన్ సిపిఎం శాఖ నాయకులు కట్టా సతీష్ ఆధ్వర్యంలో అపోలో సెంటర్ ప్రాంతం నుంచి ముత్తుకూరు గేట్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టారు. బొల్లినేని సెంటర్‌లో సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సభ్యులు కె.పెంచలనర్సయ్య, ఐద్వా నాయకురాలు షేక్ షాహినా బేగం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో 36వ డివిజన్ సిపిఎం శాఖ కార్యదర్శి ఎన్.మాలకొండయ్య పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. 32వ డివిజన్ సిపిఎం శాఖ ఆధ్వర్యంలో డైకాస్ రోడ్డు సెంటర్‌లో ప్రదర్శన చేపట్టారు. అదే విధంగా కరేడు ఉద్యమానికి మద్దతు ప్రకటించి, రైతుల పక్షాన నిలిచిన సిపిఎం మాజీ జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్‌ను ఆయన ఇంటి వద్దనే పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. 21వ డివిజన్ పరిధిలో స్థానిక కొండాయపాళెం గేటు ప్రాంతంలో సిపిఎం శ్రేణులు నిరసన ప్రదర్శన చేపట్టారు. 23వ డివిజన్ పరిధిలోని పడారుపల్లి, సుందరయ్య నగర్ ప్రాంతంలో మిని బైపాస్ రోడ్డు వద్ద ఆ డివిజన్ శాఖ కార్యదర్శి ఒంగోలు సుధీర్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కాకు సుధాకర్, చిన్నయ్య, తుమ్మల మదన్, కటికాల వెంకటసుబ్బయ్య, ప్రజాసంఘాల నాయకులు రమేష్ తదితరులు పాల్గొని పోలీసు చర్యలను ఖండించారు. ప్రజల తరపున పోరాడే వారిని వేధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ అరెస్టు సరికాదు : సిపిఎం

ప్రజాశక్తి-ఉదయగిరి : చలో కరేడు నిర్వహించిన సిపిఎం రాష్ట్ర జిల్లా నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని ఈ సందర్భంగా సోమవారం సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి కోడే రమణయ్య, రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య ఓ ప్రకటనలో వారు తెలిపారు. చలో కరేడు గ్రామంకు వెళ్తున్న సిపిఎం రాష్ట్ర జిల్లా సిపిఎం రైతుసంఘ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని వెంటనే విడిపించాలన్నారు. సంవత్సరంలో అక్కడి రైతులు మూడు పంటలను సాగుచేస్తూ కుటుంబ జీవనం ఆనందంగా గడుపుతున్నారని ఇండోసోల్ కంపెనీ పేరుతో వారి కుటుంబాలను రోడ్డున పడేస్తూ కంపెనీ ఏర్పాటు చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కరేడు గ్రామ ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే పోలీసులు చేస్తున్న అక్రమ అరెస్టులను ఆపి కరేడు గ్రామ రైతులకు అండగా నిలవాలన్నారు.



ప్రజాశక్తి-అనంతసాగరం : చలో కరేడుకు వెళ్లిన రైతుసంఘాలు, ప్రజా సంఘాల నాయకులు, రైతులు, ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం చేసిన అక్రమ అరెస్టులను సిపిఎం మండల కమిటీ ఖండించింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో సంవత్సరానికి మూడు పంటలు పండించే భూములను అదానీ కార్పొరేట్ సంస్థ ఇండో సోల్ పరిశ్రమ కోసం ప్రభుత్వం చేపట్టిన బలవంత భూసేకరణను రద్దు చేయాలని రైతు సంఘం, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తమ భూములు ఇవ్వమని కరేడు రైతులు, ప్రజలు అక్కడ జరిగిన గ్రామసభలో జిల్లా అధికారుల సమక్షంలో ఏకగ్రీవ తీర్మానం చేశారని, ఆ తీర్మానాన్ని అమలుపరచాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సెజ్‌ల పేరుతో అనేక వేల ఎకరాల భూములు పరిశ్రమల కోసం రైతుల నుంచి ప్రభుత్వం తీసుకున్నారని ఆ భూములలో ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయలేదన్నారు. మొదట పరిశ్రమల కోసం తీసుకొన్న భూమిలో పరిశ్రమలు ఏర్పాటు చేసి తర్వాత అవసరాల నిమిత్తం రైతుల వద్ద నుండి భూ సేకరణ చేయాలన్నారు. రైతుల వద్ద నుండి బలవంతపు భూ సేకరణ చేయకూడదని సిపిఎం డిమాండ్ చేసిందన్నారు. బలవంతపు భూ సేకరణ ఆపాలని కోరుతూ చలో కరేడుకు వెళ్లిన వారిని అక్రమంగా చేసిన అరెస్టులను సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు డాక్టర్ సుబ్బారాయుడు, వేము పెంచలయ్య, గాడి సుధాకర్, నాగులూరు వెంకటేష్, మస్తాన్, బాలేష్, వంశీ, సిఐటియు నాయకులు మీరా మొహిద్దిన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్ : చలో కరేడులో నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్న ఆత్మకూరు సిపిఎం పార్టీ ప్రకటించింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి మూలం రమేష్‌లతో పాటు ఆత్మకూరు సిపిఎం పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్ రాజు, ఆవాజ్ కమిటీ జిల్లా నాయకులు ఎస్దాని, రమణయ్య, గద్దర్ బాబు ఇతర నాయకులు రైతులకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు.


ఉలవపాడు పోలీస్‌స్టేషన్‌లో అరెస్టైన సిపిఎం నేతలు

కావలి జిల్లాను ఏర్పాటు చేయాలి



ప్రజాశక్తి-కావలి : కావలి, కందుకూరు, ఉదయగిరి, కొవ్వూరు, పాత అల్లూరు నియోజక వర్గాలతో కావలి కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయాలని కోరుతూ, కావలి జిల్లా సాధన సమితి సభ్యులు సోమవారం కావలి ఆర్.డి.ఓ. కార్యాలయంలో ఆర్‌డిఓ ఎం.వంశీకృష్ణను కలిసి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కావలి, కందుకూరు, ఉదయగిరి, కొవ్వూరు, పాత అల్లూరు నియోజక వర్గాలతో కావలి కేంద్రంగా జిల్లాను చేయాలని కోరుతున్నామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 24వ జిల్లాగా చేయాలనే ప్రజల ఆకాంక్ష ఉద్యమ నేపథ్యంలా కూడా ఉందన్నారు. కావలి ప్రాంతం ఒక జిల్లాగా ఏర్పడటానికి కావల్సిన అన్ని రకాల అనుకూలతలు చాలా ఉన్నాయన్నారు. కనుక పరిశీలించమని కోరుతున్నామన్నారు. కావలి జిల్లాగా ఏర్పడితే మరింత కావలి ప్రాంతం అభివృద్ధి చెందటానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమానికి కావలి జిల్లా సాధన సమితి సభ్యులు పులి చక్రపాణి, పులి రజని, కరవది భాస్కర్, అమలరి సుబ్బు, అక్కిలగుంట రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం లీగ్ పార్టీ పరిచయ కార్యక్రమం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఉలవదిబ్బ ప్రాంతంలో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ హుస్సేన్ బేగ్ మాట్లాడుతూ కేరళ మన రాష్ట్రంలో అతితంగా సమాజిక్యంగా జరుగుతూ ఆ దిశగా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ కృషి చేస్తుందని ఆగస్టు 24న ఢిల్లీలో ఖైయ్యద్ ఏ మిల్లత్ కేంద్ర కార్యాలయం నూతన ప్రారంభోత్సవానికి జిల్లా నుండి భారీగా బయల్దేరుతున్నామని తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ షకూర్ మాట్లాడుతూ ప్రతిష్ఠ, పేదవారికి సాగుభూమి ఇచ్చే ఆర్థిక పరిపుష్టికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని ఆత్మకూరు పట్టణంలోని అర్హులైన ప్రతిఒక్కరికీ సాగుభూమికి దరఖాస్తు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పట్టణ కన్వీనర్‌గా సయ్యద్ మున్సర్, ఉలవ దిబ్బ ఇన్‌ఛార్జిగా నగ్మా 14వ వార్డ్ ఇన్‌ఛార్జిగా సలాం, 15వ వార్డు ఇన్‌ఛార్జిగా ఉమ్మి హసి ఎన్నుకున్నారు.

వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవాలి

ప్రజాశక్తి-కావలి : డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో కావలి ఇందిరా నగర్ అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు విద్యాసామగ్రి, గర్భిణులు, బాలింతలకు బెడ్స్, పౌష్ఠిక్, కాల్షియం సిరప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా డిప్యూటీ డి.ఎం.హెచ్.ఒ. డాక్టర్ ప్రీతి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవాలని, మీజిల్స్ ఆరోగ్యంగా వుండడానికి వ్యాక్సిన్ తప్పకుండా వేయించాలన్నారు. కార్యక్రమంలో వెంగళరావు నగర్ పి.హెచ్.సి. వైద్యులు మహేష్, డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మహాలక్ష్మిరెడ్డి, డైరెక్టర్ కనుం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, పి.హెచ్.సి. కమ్యూనిటీ ఆర్గనైజర్ ప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-కొవ్వూరు : ప్రాథమిక దశ నుండే ప్రతి విద్యార్థి స్వయం ఉపాధి రంగాలపై అవగాహన చేసుకుంటే భవిష్యత్తులో వారికి ఆర్థిక ఇబ్బందులు ఉండవని జిల్లా ఒకేషనల్ కోఆర్డినేటర్ బి.మల్లికార్జునరావు అన్నారు. కొవ్వూరులోని పడిపాల రామానాయుడు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ఆయన పాఠశాల ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయితో ఒకేషనల్ కోర్సులపై చర్చించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యూసఫ్‌బాష, గీతాబాయి ఉన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కావలి : కృత్రిమ మేధస్సు ఉపయోగించి అంతరిక్ష పరిశోధనలో ఏ విధమైన ప్రగతి సాధించవచ్చనే అంశంపై విద్యార్థుల సృజనాత్మక ఐడియాలు ప్రదర్శించే అవకాశం ఈ ఐడియా థాన్ ద్వారా కల్పిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్ కుమార్ తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంతరిక్ష పరిశోధనా సంస్థ సిజి. డాక్టర్ వి.వి. మురళీ కృష్ణ, డాక్టర్ యువరాజ్ దీన్నం పాల్గొని ప్రసంగించి విద్యార్థులతో చర్చించుకున్నట్లు విశ్వోదయ ఆడివిడిఓ డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్ తెలియజేశారు. ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించవలసిందిగా కళాశాల చైర్మన్ దొడ్ల విద్యాధరకుమార్ రెడ్డి సూచించారు. వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొని వినూత్న ఆలోచనలను ఆవిష్కరించటానికి అడ్మిషన్లు అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులను అకడమిక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ లిఖిత్ రెడ్డి ప్రశంసించారు.

రంగారావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-కలిగిరి : కలిగిరిలోని పిఎసిఎస్ కార్యాలయంలో కదిరి రంగారావు చైర్మన్‌గా, గన్నమనేని శ్రీనివాసులు నాయుడు, సోము భాస్కర్ రెడ్డి డైరెక్టర్లుగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ రంగారావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను ఇచ్చిన ఎంఎల్ఏ కాకర్ల సురేష్‌కు, కూటమి సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ అసిస్టెంట్ దుర్మరణం

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కొవ్వూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం విశ్వనాథరావుపేట-1 సచివాలయంలో 'హెల్త్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తున్న నక్క రామ్‌కుమార్ సోమవారం ఉదయం విధులలో భాగంగా ఒంగోలు నుండి నెల్లూరు రైల్లో ప్రయాణిస్తుండగా తలమంచి సమీపానా రైలులో నుండి ప్రమాదవశాత్తు దుర్మరణం చెందారు. అతనికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. బాడీని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా ఆసుపత్రికి తరలించారని కొవ్వూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ ఆర్.రామకృష్ణ తెలిపారు.

బంగారు ఆభరణాలు బహూకరణ

ప్రజాశక్తి-సంగం : సంగం సంగమేశ్వర స్వామి ఆలయానికి సంగం గ్రామానికి చెందిన దాతలు కోట సుధాకర్ రెడ్డి, వాయసుత దంపతులు సుమారు రూ.5.60 లక్షల విలువైన 49 గ్రాముల బంగారాన్ని బహూకరించారు. స్వామి వారికి త్రినేత్రంతో కూడిన నామాలు, అమ్మవారికి బొట్టు, ముక్కుపుడక బహూకరించారు. దాతకు సంబంధించిన కుటుంబ సభ్యులు కోటు కరుణాకర్ రెడ్డి ఈఓ రఘురామయ్యకు బంగారాన్ని ఆలయంలో సమర్పించారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఇఒ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గోపాలకృష్ణశర్మ, ఆలయ నిర్వాహకులు గంధి గోపీకృష్ణ, వేమా మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

కోమల విలాస్ హోటల్ ప్రారంభం

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలోని ముసునూరు సాగత్తమ్మ (ట్రంక్ రోడ్డు)లో నూతనంగా ఏర్పాటు చేసిన కోమల విలాస్ హోటలును కావలి ఎంఎల్ఏ దగుమటి వెంకట కృష్ణారెడ్డి సోమవారం ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి, ప్రారంభించిన ఆయన హోటల్‌ను పరిశీలించారు. నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని భోజన ప్రియులకు అందించాలని ఎంఎల్ఏ హోటల్ యాజమాన్యం కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, మధుబాబునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-కొవ్వూరు : మండలం పరిధిలోని నార్త్ మోపూరు శ్రీ పర్వత వర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థాన పాలక మండలి ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంఎల్ఏ ప్రశాంతిరెడ్డి, వేమిరెడ్డి కోటారెడ్డి, బీద గిరిధర్ మన స్వాగతం పలికిన ఆలయ కమిటీ సభ్యులు ఆలయ నాయకులు మరియు గ్రామస్తులు అనంతరం ఇఒ చిట్టిబాబు ఎన్నికైన చైర్మన్ రేబాల కిషోర్ రెడ్డి, ధర్మకర్తలు, మేడ సుబ్బయ్య, బట్ట మేకల కొండమ్మ, పొన్నగంటి శ్రీనివాసులు, గోపాలయ్య, పొంగూరు వెంకటేశ్వర్లు, కొమ్మి బాలయ్య, ఐంది పెంచలయ్య, బుర్రి కవిత ప్రమాణస్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన దేవాలయ ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులు ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని కావలి ఎంఎల్ఏ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి కోరారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పెన్నా డెల్టా వైస్ చైర్మన్ ప్రసాద్ గిద్దలూరి, పైడేరు ఎత్తిపోత చైర్మన్ రేబాల శంకర్, నాయకులు ఐంది శ్రీనివాసులు రెడ్డి, హరికృష్ణ, హిరనాథ్, చెంచాటి కృష్ణమోహన్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ముందుకు సాగాలి

ప్రజాశక్తి-కొవ్వూరు : ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంచుకుని తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా దానిని సాధించే దిశగా ముందుకు సాగాలని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సైకాలజిస్ట్ నాగప్రసాద్ తెలిపారు. కొవ్వూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఓరియెంటేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కావలి విశ్వోదయ గ్రూప్ విద్యాసంస్థల అధ్యక్షులు వి.సుధాకర్‌రెడ్డి, కళాశాల కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి.సుబ్బారావు, ఇంజనీరింగ్ హెడ్ క్యాటరింగ్ డాక్టర్ కెఎస్ పి. సుబ్బారెడ్డి పలు విషయాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం గత సంవత్సరం బహుమతి సాధించిన విద్యార్థులకు ఉత్తీర్ణులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సంయుక్త కార్యదర్శి పి. శ్రీనివాసులురెడ్డి, కోశాధికారి వై. విజయశంకర్‌రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రవణ్ కుమార్ రెడ్డి, అడ్మిషన్ డీన్ డాక్టర్ టిఎస్ఎస్‌సి బుర్రా కుమార్, డాక్టర్ పి.ఎం. కిషోర్, విభాగాధిపతులు, అధ్యాపకులు ఉన్నారు.

ఎంవిఐ రాములుకు ఉత్తమ అవార్డు



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : 79వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా విధి నిర్వహణ సేవలు అందించినందుకు గానూ ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాములు జిల్లాస్థాయి ఉత్తమ అవార్డు అందుకున్నారు. డివిజన్లో ప్రజలతో మమేకంగా ఉంటూ వాహనాల డ్రైవర్లను నిరంతరం అన్నిశాఖల్లో అప్రమత్తం చేస్తూ అత్యంత అంకితభావంగా చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తూ ఉంటారు క్రమంతప్పకుండా రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించి డ్రైవర్లకు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు.

విఆర్‌ఒలతో తహశీల్దారు సమీక్ష

ప్రజాశక్తి-దగదర్తి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలతో సమావేశాన్ని తహశీల్దార్ పి.కృష్ణ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇళ్ల స్థలం లేక ఇబ్బందులు పడుతున్న వారు అర్జీలు సమర్పించి ఉంటే గ్రామాల్లోకి వెళ్లి విచారణ చేపట్టి సూచించారు. అన్నదాత సుఖీభవ అందకుండా ఇబ్బంది పడుతున్న రైతు వారు అందికి ఆధార్ నెంబర్ లింక్ చేసి అన్నదాత సుఖీభవ అదే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

స్కాలర్‌షిప్‌లకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-సంగం : సంగం జెడ్‌పి హైస్కూల్‌లో 2024-25 సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన నలుగురు విద్యార్థులు యువ అన్‌స్టాపబుల్ స్కాలర్షిప్‌లకు ఎంపికయ్యారు. దుత్తలూరుకు చెందిన సీడ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు నలుగురు విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ మేరకు హెడ్మాస్టర్ బుజ్జయ్య విద్యార్థులకు ఎంపిక పత్రాలను అందజేసి అభినందించారు. ఈ స్కాలర్షిప్‌లో ఒక్కో విద్యార్థికి రూ.2లక్షలు వస్తాయని తెలిపారు. సీడ్స్ స్వచ్ఛంద సంస్థకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాల నుండి మరెంతోమంది ఈ స్కాలర్షిప్‌నకు ఎంపికవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 22వ తేదీన విద్యారంగ సమస్యల పరిష్కారానికి జరిగే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి దగ్గు యగ్నేష్ కోరారు. ఈ సందర్భంగా చలో కలెక్టరేట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దగ్గు యగ్నేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికే 14 నెలలు గడుస్తున్న కనీసం విద్యార్థులకు ఇచ్చిన హామీలు కానీ విద్యారంగ సమస్యలు పరిష్కార చట్టం కానీ ఏది కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. విద్యారంగంపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందన్నారు. ప్రభుత్వ తీరును ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఖండిస్తుందన్నారు. ఆగస్టు 22 శుక్రవారం జరగనున్న ఎస్ఎఫ్ఐ ఛలో కలెక్టరేట్ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు నగరంలోని విఆర్‌సి గ్రౌండ్ నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు జరగనున్న భారీ ర్యాలీలో జిల్లా విద్యార్థులంతా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ మొండి వైఖరిని వీడి విద్యారంగ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి వెంటనే విద్యారంగంలో నెలకొని ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించే దిశగా పనిచేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు. సమస్యలు పరిష్కరించని యెడల జిల్లా వ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యచరణ రూపొందించుకొని పోరాటాన్ని కొనసాగి స్తామని తెలియజేశారు.కార్యక్రమంలో శీను, సాయి, తదితరులున్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మేల్ నర్స్‌పై దాడికి పాల్పడిన హౌస్‌సర్జన్స్

ప్రజాశక్తి -నెల్లూరు



నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల అత్యవసర విభాగంలో విధి నిర్వహణలో ఉన్న వెంకట్ అనే మేల్ నర్స్‌పై హౌస్ సర్జన్స్ దాడికి పాల్పడ్డారు. సోమవారం పెద్ద హాస్పిటల్లో రాత్రి 8గంటల సమయంలో డ్యూటీలో ఉన్న స్టాఫ్ నర్స్‌పై హౌస్ సర్జన్‌లు క్యాజువాలిటీ దగ్గర చిన్నపాటి ఘర్షణ వల్ల స్టాఫ్ నర్స్‌పై విపరీతంగా దాడి చేశారు. ఈ దాడులు ఖండిస్తూ పెద్ద హాస్పిటల్‌లో ఉన్న స్టాఫ్ నర్సులు హాస్పిటల్ ముందు నిరసన వ్యక్తం చేశారు.

విద్యా వలంటీర్ ఏర్పాటు

ప్రజాశక్తి - ఉదయగిరి



మండల పరిధిలోని పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 60మంది విద్యార్థులు ఉండగా 8 తరగతులకు ఇద్దరే ఉపాధ్యాయులు ఉండటంతో ఉపాధ్యాయుల కొరతను పాఠశాల పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేయడంపై ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ప్రధానోపాధ్యాయులు గాజులపల్లి సుబ్బారెడ్డి మాట్లాడుతూ గ్రామ పెద్దలు, యువకులు, పూర్వ విద్యార్థుల దృష్టికి ఉపాధ్యాయుల కొరతను తీసుకువెళ్లామన్నారు. వెంటనే పాలకొండ వెంకటేష్ అనే పూర్వవిద్యార్థి తాను ఒక విద్యావాలంటరీని నియమించి జీతం అయ్యే ఖర్చు తనే భరిస్తానని హామీ ఇచ్చారని వెంటనే బిఎస్‌సి, బిఇడి పూర్తి చేసిన ప్రియాంక అనే విద్యా వాలంటరీ నియమించమన్నారు. రూ.60వేలు అయ్యే జీతబత్యాల ఖర్చును పాలకొండ శ్రీనివాసులు రెడ్డి పేరుతో వారి తమ్ముడు పాలకొండ వెంకటేష్ విద్య వాలంటరీకి అయ్యే ఖర్చు చెల్లించడంపై ఉపాధ్యాయులతో పాటు పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ప్రశాంత కుమారి, స్థానిక రిటైర్డ్ ఉపాధ్యాయులు రత్నం, పాఠశాల చైర్మన్ దేవకుమారి, పూర్వ విద్యార్థులు జయసింహ, శ్రీనాథ్, శ్రీకాంత్, రాజా, ప్రతాప్, నవీన్ పాల్గొన్నారు.

విఆర్‌ఒకు ఉత్తమ సేవా అవార్డు




ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మండలంలోని నువ్వూరుపాడు విఆర్‌ఒ వి.మురళీ ధర్ రావు స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఉత్తమ అవార్డును అందుకున్నారు. విధి నిర్వహణలో మురళీధర్ రావు ఎంతో సౌంబిడిగా ప్రజలతో మమేకమై అంకిత భావంతో విధులు నిర్వహిస్తుండటంతో ఆయన సేవలను గుర్తించి జిల్లా యంత్రాగం ఆయనకు ఉత్తమ అవార్డును ఎంపిక చేశారు. శుక్రవారం నెల్లూరులో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనందల చేతుల మీదుగా ఈ అవార్డును మురళీధర్ అందుకున్నారు. అత్యంత చిత్తశుద్ధితో విధులు నిర్వహించారు. ఆయనకు అవార్డు లభించడంపై పలువురు పార్టీ నాయకులు గ్రామస్తులు ప్రజాసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

'అన్నదాత సుఖీభవ'కు దరఖాస్తులు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని అన్నదాతలకు అన్నదాత సుఖీభవకు మరొక అవకాశం 20వ తేదీలోగా మండలంలో ఇంకా అన్నదాత సుఖీభవకు అర్హత కలిగి వుండి ఇంతవరకు దరఖాస్తు చేసుకొనని రైతులు అందుబాటులో ఉన్న రైతుసేవా కేంద్రంలోని నమోదు చేసుకోవాలని, వ్యవసాయ సహాయకులను నమోదు చేసుకొన్న తరువాత 2వ ఇన్‌స్టాల్‌మెంట్లో అమౌంట్ వస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు పత్రికాముఖంగా తెలియజేశారు.


నవాజ్‌ను సన్మానిస్తున్న ఎంఇఒ

అవార్డు గ్రహీత నవాజ్‌కు సన్మానం

ప్రజాశక్తి-ఉదయగిరి

జాతీయ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉదయగిరిలో మెస్సెంజర్‌గా పనిచేయుచున్న షేక్.నవాజ్ జిల్లా ఉత్తమ మెసెంజర్ అవార్డు అందుకున్న సందర్భంగా సోమవారం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో సీతారాంపురం ఎంఇఒ షేక్ మస్తాన్ వలీ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మండల రెవెన్యూ అధికారి ఎల్.రామ్మోహన్, మండల అభివృద్ధి అధికారి అప్పాజీ పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు తోట శ్రీనివాసులు, టి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది, సిఆర్ఎంటిలు, ఎంఐఎస్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.